


రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చలసాని మాలిని (విశాఖపట్నం) ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ మేరకు చెక్కును ఏఈఓ కృష్ణారావుకు ఆమె బంధువు రాధాకృష్ణ అందజేశారు.



కడలిలోకి 10,689 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 10,689 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

గరిష్టం/కనిష్టం
42.5°/27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.0	27.0
కాకినాడ	36.0	28.5
అమలాపురం	42.5	27.0

న్యూస్‌రీల్

సత్యదేవుని దర్శించిన 30 వేల మంది



ఎండకు తాళలేక పందిరి కింద సేద తీరుతున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని ఆలయం ఆదివారం కూడా భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. వ్రతాలు 2 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.35 లక్షల ఆదాయం లభించింది. పగలంతా 40 డిగ్రీల సెల్సియస్‌కు పైబడిన ఎండతో రత్నగిరి నిప్పుల గుండాన్ని తలపించింది. అటువంటిది సాయంత్రం 4 గంటల నుంచి దట్టమైన మబ్బులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురవడంతో ఆలయ ప్రాంగణం చల్లబడింది. దీంతో భక్తులు, అన్నవరం గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు యథావిధిగా స్పందన

కాకినాడ సిటీ: జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి జరుగుతుంది. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయం గమనించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

న్యాయవాదులకు సత్కారం

కిర్లంపూడి: తుని రైలు దహనం కేసు వాదించిన చోడిశెట్టి మన్మధరావు, నిర్మలమ్మ దంపతులను మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం, కాపు జేఏసీ నాయకులు నల్లా విష్ణు, కల్వకొలను తాతాజీ, గౌతు స్వామి, గణేషుల రాంబాబు, మంచాల సాయి సుధాకర్ కలిసి ఘనంగా సత్కరించారు. కాపు ఐక్య గర్జన సందర్భంగా 2016లో జరిగన తుని రైలు దహనం సంఘటనలో 41 మందిపై పెట్టిన కేసులను విజయవాడ రైల్వే కోర్టు ఇటీవల కొట్టివేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ కేసులను వాదించిన మన్మధరావు దంపతులను, అక్రమ కేసుల నుంచి విముక్తి పొందిన 41 మందిని ముద్రగడ పద్మనాభం ఆదివారం తన నివాసానికి గౌరవంగా భోజనానికి ఆహ్వానించారు. ప్రత్తిపాడు నుంచి కిర్లంపూడి ముద్రగడ నివాసం వరకూ సుమారు 3 వేల మందితో మోటార్ సైకిళ్ల ర్యాలీ, పుష్ప వర్షం నడుమ మన్మధరావు దంపతులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. తొలుత వారికి స్థానిక ఏనుగు వీధి కాపు నాయకులు, ఎస్సీ పేట పెద్దలు పూలమాలలు వేసి సత్కరించారు. కిర్లంపూడి ఎస్సీ పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి మన్మధరావు దంపతులు పూలమాల వేసి నివాళులర్పించారు. వారిని సత్కరించి, సన్మాన పత్రాలు అందించారు. ఈ బైక్ ర్యాలీలో స్థానికులతో పాటు జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల నుంచి భారీగా కాపు నాయకులు పాల్గొన్నారు.



మన్మధరావు దంపతులను సత్కరిస్తున్న ముద్రగడ పద్మనాభం, కాపు జేఏసీ నాయకులు

వైభవంగా పునఃప్రతిష్ఠా మహోత్సవాలు



అమ్మవారి మూర్తులకు క్షీరాభిషేకం చేస్తున్న చైర్మన్ అచ్చియ్యనాయుడు, ఈఓ విశ్వనాథరాజు, భక్తులు

- తలుపులమ్మ తల్లికి పిండివంటల సారె సమర్పణ
- ఊరేగింపుగా తరలివచ్చిన వి.కొత్తూరు గ్రామస్తులు

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి జీర్ణోద్ధరణ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజుల ఆధ్వర్యాన వేద పండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, శశాంక్ త్రిపాఠి, పురుషోత్తమశర్మ, అర్చకులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రపాలక, యోగిని, నవగ్రహ మండపారాధనలు, యాగశాలా సంస్కారాలు, శాలా హోమాలు, జలాధివాసం, క్షీరాధివాసం, చతుర్వేద, చండీ పారాయణలు, చండీ హోమం, అష్టదిగ్బలులు తదితర క్రతువులు నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మకత కమిషన్ చైర్మన్ ఎల్.జోగినాయుడు దంపతులు దర్శించి, పూజలు చేశారు. వారికి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను చైర్మన్, ఈఓ అందజేశారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా వి.కొత్తూరు గ్రామస్తులు అమ్మవారికి పిండివంటల సారె సమర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, సర్పంచ్ దుంగల గణపతి రోజామణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, గ్రామ కమిటీ ఆధ్వర్యాన వందలాదిగా మహిళలు ఇళ్ల వద్ద పిండివంటలు తయారు చేసి, దేవస్థానానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారిని దర్శించి, సారె నివేదించారు. వారిని సాదరంగా ఆహ్వానించిన చైర్మన్, ఈఓ, ధర్మకర్తలు.. పసుపు కుంకుమ, గాజులు, రవికె, ప్రసాదాలు బహూకరించారు. తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దుంగల నాగేశ్వరరావు, కిల్లి సన్యాసిరావు, తమరాన శ్రీనివాసరావు పాల్గొన్నారు. లోవ దేవస్థానంలో తొలిసారిగా మహా అన్న సంతర్పణ జరిగింది. రెండు వేల మందికి పైగా అన్న సంతర్పణ చేయడం దేవస్థానం చరిత్రలో ఇదే తొలిసారని ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. జీర్ణోద్ధరణ కార్యక్రమాలు జరిగే ఐదు రోజులూ అన్న సంతర్పణ కొనసాగిస్తామని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం ఉదయం ప్రాతఃకాల మంటపారాధన, యాగశాల సంస్కారాలు, ప్రతిష్ఠాంగ హోమాలు, చతుర్వేద, చండీ పారాయణలు, చండీహోమం తదితర క్రతువులు నిర్వహించనున్నారు.



అమ్మవారికి పిండివంటల సారె తీసుకువస్తున్న వి.కొత్తూరు గ్రామస్తులు

సుజలం.. సఫలం



ఓపీ టెర్రస్‌పై కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు

- జీజీహెచ్‌లో తీరుతున్న తాగునీటి కష్టాలు
- 8 చోట్ల మంచినీటి కేంద్రాలు
- దాతల సహకారం, ప్రభుత్వ చొరవ

కాకినాడ క్రైం: ధర్మాసుపత్రి దాహం తీరుతోంది. రోగులు వారి బంధువులు, సిబ్బంది దాహార్తిని తీర్చేలా స్వచ్ఛమైన మంచినీటి వ్యవస్థ జీజీహెచ్‌లో అందుబాటులోకి వచ్చింది. గడచిన రెండేళ్లుగా అంచెలంచెలుగా తీసుకున్న చర్యలతో ఆసుపత్రిలో మంచినీటి కష్టాలు మటుమాయమయ్యాయి. గతంలో జీజీహెచ్‌లో మంచినీటికి కేవలం ప్లాంట్ల పైనే ఆధారపడేవారు. జీజీహెచ్‌లో రోగుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యామ్నాయ నీటి వనరులు ఏర్పాటు చేయాలని నాటి కలెక్టర్లకు వివిధ స్వచ్ఛంద సంస్థలు పలుమార్లు విన్నవించాయి. రోగులూ అప్పటి సూపరింటెండ్లకు వినతిపత్రాలిచ్చే వారు. అయినప్పటికీ ఎటువంటి మార్పు రాలేదు. ఇదే అదనుగా జీజీహెచ్ ఆవరణలోని దుకాణాల్లో మంచినీటి సీసాలు, అందునా నాసిరకం సైతం విక్రయించి సొమ్ము చేసుకునేవి. ఉన్న మూడు ప్లాంట్ల వద్ద నీటి కోసం జనాలు గంటల తరబడి బారులు తీరేవారు. సిబ్బంది సైతం ఇంటి నుంచి తెచ్చుకున్న సీసా నీటితోనే తిరిగి వెళ్లే వరకూ గొంతు తడుపుకోవలసి వచ్చేది.

నేడు తీరిన సమస్య

ప్రభుత్వం, ప్రస్తుత అధికారుల చొరవ, దాతలు, రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) పూర్వ విద్యార్థుల సహకారంతో జీజీహెచ్‌లో మంచినీటి సమస్య నేడు పూర్తిగా తీరింది. ఎక్కడికక్కడ బ్రాండెడ్ వాటర్ ప్యూరిఫయర్లు, వాటి నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. మొత్తం జీజీహెచ్‌లోని నీటి సరఫరా వ్యవస్థలను ఈ విభాగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూస్తుంది. మంచినీరు చల్లనిదైనా, వేడిదైనా అడిగి మరీ పొందే సౌలభ్యం ఉంది. రూ.1 నామమాత్రపు రుసుముతోనో, అదీ లేకుండా పూర్తి ఉచితంగానే కావలసినంత నీరు తీసుకువెళ్లే సదుపాయం ఏర్పడింది. గతంలో మూడు మాత్రమే మంచినీటి కేంద్రాలు ఉండగా, నేడు ఆ సంఖ్య ఎనిమిదికి చేరింది. కీలకమైన వార్డుల వారీగా అదనపు వాటర్ ప్యూరిఫయర్లు ఏర్పాటు చేశారు. ప్రసూతి విభాగం ఎదురుగా ఎన్ఎఫ్‌సీఎల్ వాటర్ ప్లాంటు, సర్జికల్ బ్లాక్, మెడికల్ విభాగం ఎదురుగా కోరమండల్‌వి 2 ప్లాంటులు, క్యాజువాలిటీ, కార్డియాలజీ సమీపంలో, టీబీ వార్డు, ఎల్ఆర్, ఎస్ఆర్ఎంటీ వద్ద ఏర్పాటు చేసిన మంచి నీటి కేంద్రాలు రోగుల దాహార్తిని తీరుస్తున్నాయి.

ఆరు నెలలుగా జీజీహెచ్‌లో నీటి వినియోగం (కోట్ల క్యూసెక్కులలో)			
నవంబర్	2.5	ఫిబ్రవరి	2.8
డిసెంబర్	2.7	మార్చి	3
జనవరి	2.6	ఏప్రిల్	18

70 ట్యాంకులు

జీజీహెచ్‌లో నీటి సరఫరాను సుస్థిరం చేసేందుకు మొత్తం 70 వాటర్ ట్యాంకులు ఏర్పాటయ్యాయని వాటర్ సప్లయిస్ వర్క్‌షాప్ గ్రేడ్-2 మెకానిక్ కిలారి సురేంద్రరాజు తెలిపారు. ఉన్న 70 ట్యాంకుల్లో 68 ఓవర్ హెడ్ ట్యాంకులు కాగా, మిగిలిన రెండు 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సిమెంటు, ఇనుప వాటర్ ట్యాంకులు. జీజీహెచ్‌లో నాణ్యమైన మంచినీటిని ఎటువంటి ఆటంకమూ లేకుండా అందించేందుకు మూడు నెలల వ్యవధిలో 32 పాత ట్యాంకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామని సురేంద్ర తెలిపారు. సర్జికల్, మెడికల్, ఓపీ టెర్రస్, క్యాజువాలిటీలపై పాతవాటి స్థానంలో 2 వేల కిలోలీటర్ల సామర్థ్యంతో కొత్త ట్యాంకులు ఏర్పాటు చేశామని చెప్పారు.

కొత్త పైపులైన్లు

జీజీహెచ్‌లో మంచినీటి సరఫరాకు ప్రస్తుతం ఉన్న పాత జీఐ పైపులైన్లు తుప్పు పట్టి భూమి లోపలే పగిలిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు యూపీవీసీ పైపులైన్ల నిర్మాణం జరుగుతోందని ఆర్ఎంఓ డాక్టర్ రాహుల్ తెలిపారు. వీటిని గోడల్లో ఏర్పాటు చేస్తారని, దీనివల్ల లీకేజీని తక్షణమే గుర్తించవచ్చని చెప్పారు. ప్రతి మూడు నెలలకోసారి ట్యాంకులన్నింటినీ శుభ్రం చేయిస్తున్నామన్నారు. భారీ సామర్థ్యం ఉన్న సిమెంటు, ఇనుప ట్యాంకుల్లో కోయాగ్లేషన్ బాల్స్ వేసి, నీటి శుద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్ మంచినీటి వ్యవస్థ నిర్వహణకు గ్రేడ్-2 మెకానిక్ ఆధ్వర్యాన ఐదుగురు సిబ్బందితో కూడిన ప్లంబింగ్ సిబ్బంది పని చేస్తున్నారని చెప్పారు. వీరికి అదనంగా పారిశుద్ధ్య విభాగం తోడ్పాటునందిస్తోందని తెలిపారు.

ఆరు రెట్లు అధికంగా వినియోగం

ప్రతి నెలా మంచినీటి సరఫరాపై జీజీహెచ్‌లో ప్రత్యేక గణాంకాలు ఉంటాయి. వీటి ప్రకారం భవిష్యత్ నీటి అవసరాలపై మున్సిపల్ విభాగం ముందుగానే ఓ అంచనాకు వచ్చి, తగిన చర్యలు చేపడుతుంది. గత నెలలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి ఆరు రెట్లు అధికంగా నీటి వినియోగం జరిగింది. దీనిపై కొద్ది రోజుల క్రితం పరిశీలనకు వచ్చిన మున్సిపల్ నిపుణుల బృందం.. వేసవి తాపం, చలివేంద్రాల నిర్వహణ, అన్ని విభాగాల్లోకీ ఎటువంటి లోటూ లేకుండా నీరు చేరడమే నీటి వినియోగం పెరుగుదలకు కారణమని గుర్తించింది.

ఎస్‌టీపీ ఏర్పాటుకు ప్రణాళికలు

మరోపక్క జీజీహెచ్‌లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మంచినీటి కేంద్రాలు సహా వివిధ ప్రాంతాల నుంచి వృథా పోతున్న వ్యర్థ జలాన్ని ఈ ప్లాంట్‌లో ప్రాసెస్ చేసి, మరుగుదొడ్లకు, మొక్కల పెంపకానికి వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టును ఏపీఎంఎస్ఐడీసీ చేపట్టనుంది.

దాతలు సహకరిస్తే మరింత మెరుగ్గా..



జీజీహెచ్‌లో మంచినీటి సదుపాయాల్ని మెరుగుపరిచేందుకు చేసిన అన్ని ప్రయత్నాలూ సఫలమయ్యాయి. ప్రతి వార్డుకూ మంచినీటి సరఫరాను అనుసంధానం చేయాలని భావిస్తున్నాం. దాతలు సహకరిస్తే మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

– డాక్టర్ హేమలతాదేవి, సూపరింటిండెంట్, జీజీహెచ్, కాకినాడ



జీజీహెచ్‌లో కన్సీల్డ్ లైనింగ్ ద్వారా గోడల్లో నీటి పైప్‌లైన్ల నిర్మాణం



కార్డియాలజీ వార్డు వద్ద ప్యూరిఫయర్ నుంచి మంచినీరు పట్టుకుంటున్న రోగి బంధువు

పగలు ఎండ తీవ్రత.. సాయంత్రం కుండపోత

- దంచి కొట్టిన భారీ వర్షం
- తోడైన ఈదురు గాలులు



సామర్లకోట సత్యనారాయణపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద విరిగి పడిన చెట్టు, విద్యుత్ స్తంభం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ)/పెద్దాపురం: గ్రీష్మ రుతువు.. అందునా రోహిణీ కార్తె కావడంతో సూర్యుడు పగటి వేళ చండప్రచండంగా ప్రతాపం చూపిస్తున్నాడు. కాకినాడలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీల సెల్సియస్ మాత్రమే నమోదైనప్పటికీ ఉష్ణతాపం తీవ్ర స్థాయిలో ఉంది. వడగాలులు వీచాయి. దీంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. అయితే, సాయంత్రం 4 గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, బలమైన ఈదురు గాలులు వీచాయి. కాకినాడ, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం తదితర మండలాల్లో వర్షం దంచికొట్టింది. గాలుల తాకిడికి పలు మండలాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. ట్రాఫిక్‌కు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రత్తిపాడు - సామర్లకోట రోడ్డులో పెద్దాపురం మండలం వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, చంద్రమాంపల్లి తదితర గ్రామాల్లోని 15 ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. దీంతో చాలాచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు వాహనాల్లో ప్రయాణిస్తున్న ప్రజలు గమ్యస్థానాలకు నడిచి వెళ్లారు.



సామర్లకోటలోని పెద్దాపురం రోడ్డులో వాననీటి ప్రవాహం

మొక్కవోని అభిరుచితో..



గుత్తులుగా విరగకాసిన ఎర్ర గులాబ్ జామ్

- ఆ ఇల్లే నందనవనం
- మొక్కల పెంపకమంటే మక్కువ
- భార్య హాబీకి తోడైన భర్త ప్రోత్సాహం



మందు వేసవిలోనూ నందన వనంలా కనిపిస్తున్న రాధాకృష్ణ నిలయం

కాకినాడ రూరల్: ఆమెకు చిన్నప్పటి నుంచీ మొక్కలంటే ప్రాణం. అందుకే భర్త రిటైరయ్యాక విశ్రాంత జీవనంలో వివిధ రకాల మొక్కలు పెంచుతూ తమ ఇంటిని నందనవనంగా మార్చుకున్నారామె. సామర్లకోట మండలం ఉండూరుకు చెందిన కంకనాల పల్లి మురళీగోపాలకృష్ణ ఇరిగేషన్ శాఖలో పని చేశారు. 2004లో ఉద్యోగ విరమణ చేశారు. ఆయన భార్య రాధ. వివిధ ప్రాంతాల్లో పని చేసినా పెన్షనర్ల ప్యారడైజ్‌గా పిలిచే కాకినాడలో స్థిరపడ్డారు. కాకినాడ రమణయ్యపేట దుర్గా విద్యుత్ నగర్‌లో పాత ఇంటిని కొనుక్కుని అభిరుచికి అనుగుణంగా తీర్చిదిద్దుకున్నారు. భర్త పని చేసిన చోటల్లా రాధ తనకున్న మొక్కల పెంపకం హాబీని కొనసాగించారు. ఇప్పుడు తమ 418 చదరపు గజాల ఆవరణనూ నందనవనంగా మార్చుకున్నారు. ఇంటి ఆవరణలో సగ భాగం మొక్కలకు కేటాయించారు.

పూర్తిగా స్థల వినియోగం : ఒకటా రెండా.. మొదటి అంతస్తు టెర్రస్‌పై చేప ఆకారంలో నీళ్ల ట్యాంక్ నిర్మించారు. అక్కడి నుంచి మొక్కలకు నీటిని అందిస్తున్నారు. రాధాకృష్ణ నిలయంగా వ్యవహరించే ఆ ఇల్లు పచ్చదనం ఉట్టిపడేలా ఆహ్లాదకర వాతావరణంతో స్వాగతిస్తుంది. నోరూరించే కొత్తపల్లి కొబ్బరి మామిడి, సువాసనలు వెదజల్లే సింహచలం సంపెంగ, తెలుపు, గులాబీ రంగుల చలవ జామ, అరటి.. ఇలా ఎన్నో మొక్కలు, చెట్లు ఇక్కడ ఆకట్టుకుంటున్నాయి. మొదటి అంతస్తుకు వెళ్లగానే ఎదురుగా రకరకాల పూల మొక్కలు మనసును దోచుకుంటాయి. టెర్రస్‌పై పూలు, పండ్ల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.



ఇంటి ముందు పచ్చని మొక్కలతో రాధ

ఆమె అభిరుచిని ప్రోత్సహిస్తా..



చిన్నప్పటి నుంచే రాధకు మొక్కల పెంపకం ఇష్టం. ఉద్యోగం చేసిన ప్రతిచోటా ఇంటిని పచ్చదనంతో నింపేది. ఆమె అభిరుచికి అనుగుణంగా రిటైరయ్యాక కాకినాడలో ఇల్లు కొన్నాను. మొక్కల పెంపకం హ్యాబీగా ఉన్న ఆమెకు అన్ని విధాలా సహకరిస్తూ విశ్రాంత జీవనం సాగిస్తున్నాను. ఆమె కృషికి అవార్డులు, ప్రశంసలు వచ్చాయి.

– కంకనాలపల్లి మురళీగోపాలకృష్ణ

మొక్కలతోనే జీవితం



మొక్కలు పెంచడం ఓ కళ. చిన్నప్పటికి నుంచీ పెంచేదాన్ని. పెళ్లయ్యాక ఉద్యోగ రీత్యా ఎక్కడ ఉంటే అక్కడ మొక్కలు పెంచడం అలవాటుగా మారింది. కాకినాడలో స్థిరపడ్డాక మేమనుకున్నట్టుగా ఇంటిని మార్చుకున్నాం. ఆహ్లాదకర వాతావరణం కల్పించుకున్నాం. మొక్కలతో పాటు పక్షులకు గూళ్లు ఏర్పాటు చేశాం. అవసమయ్యే ఎరువును ఇంట్లోనే సొంతంగా తయారు చేసుకుంటాం.

– కంకనాలపల్లి రాధ

కాయగూరలు.. పండ్ల తోటలు

రాధాకృష్ణ నిలయంలో కాయగూరలకూ కొదవలేదు. తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, పొన్నగంటి వంటి ఆకుకూరలతో పాటు వంగ, బీర, ఆనప, టమాటా, పచ్చిమిర్చి, కాకర వంటివి ఇక్కడ కనిపిస్తున్నాయి. మరో అడుగు ముందుకేస్తే పండ్ల చెట్లు పలకరిస్తాయి. పైనాపిల్, బత్తాయి, సపోటా, కమలా, నారింజ, స్వీట్ లెమన్, నిమ్మ, కమలా నిమ్మ, స్ట్రాబెర్రీ, జామ, తైవాన్ జామ, బత్తాయి పాల్సా, బార్బిడస్ చెర్రీ, సూర్యనారాయణ చెర్రీ, మినీ జామ, ఎర్ర సీతాఫలం, సీతాఫలం, లక్ష్మణఫలం, స్వీట్ నారింజ, స్టార్ ఫ్రూట్, గులాబ్ జామ్, యాపిల్, మలయా యాపిల్, ఎగ్ ఫ్రూట్, అంజీర, మునగ, యాలకులు, బొప్పాయి, బిర్యానీ ఆకు, ఆల్ స్పైసీ ఆకు, చెరకు, డ్రాగన్ ఫ్రూట్, తెల్ల నేరేడు.. ఇలా ఎన్నో రకాల పండ్ల మొక్కలు, చెట్లు ఇక్కడ విస్మయం కలిగించేలా కనిపిస్తాయి. మందార, గులాబీ, చామంతి, సంపెంగ, చిలక గోరింట, జర్బిరా, గడ్డి గులాబీ, కనకాంబరాలు, గన్నేరు, ఎడినియమ్ ఫ్లవర్, బోగన్‌విలియా, లిల్లీ, బ్రహ్మకమలం, శంఖం పూల గుబాలింపు, వాటి సొగసు మనసును కట్టిపడేస్తాయి.



ఇంటి మేడపై కుండీలలో అందమైన మొక్కలు



పూలకుండీల నడుమ గౌతమ బుద్ధుడు

క్లుప్తంగా

ఏవో, ఈవో పీఆర్ అండ్ ఆర్డీలకు పదోన్నతులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఆఫీస్ అసిస్టెంట్స్, ఈవో పీఆర్ అండ్ ఆర్డీలకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇద్దరు, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి ఒక్కొక్కరు ఏవోలను, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఒకరు, అనకాపల్లి నుంచి ఇద్దరు, శ్రీకాకుళం, ఏఎస్ఆర్ జిల్లా నుంచి ఒకరు ఈవోపీఆర్అండ్ ఆర్డీలను కాకినాడ జిల్లాకు బదిలీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాకు తూర్పుగోదావరి జిల్లా నుంచి ముగ్గురు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఒక ఏవోను, కాకినాడ నుంచి ముగ్గురు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈవోపీఆర్అంఆర్డీలను బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాకు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ ఒక్కొక్క ఈవోపీఆర్అండ్ఆర్డీలను, ఒక ఏవోను బదిలీ చేశారు. ఏఎస్ఆర్ జిల్లాకు అనకాపల్లి నుంచి ఒక ఈవోపీఆర్ అండ్ ఆర్డీ, శ్రీకాకుళం నుంచి ఒక ఏవోను బదిలీ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఏవోలలో ముగ్గురిని పశ్చిమ గోదావరి జిల్లాకు, ఒకరిని అనకాపల్లి జిల్లాకు పదోన్నతిపై బదిలీ చేశారు.

చికిత్స పొందుతూ ఆశా వలంటీర్ మృతి


నాగమణి

కాజులూరు: అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న పల్లిపాలెం ఆశా వలంటీర్ మాసగిరి నాగమణి (45) చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగమణి శుక్రవారం విధులు నిర్వహించుకుని ఇంటికి తిరిగివచ్చి అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. కుటుంబీకులు గమనించి యానాం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి ఆమె మృతి చెందారు. హై బీపీ, కిడ్నీ సమస్యల కారణంగా నాగమణి కోమాస్థితికి చేరుకుని మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగమణి 15 సంవత్సరాలుగా గ్రామంలో ఆశా వలంటీర్‌గా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేడు నాదస్వర పాఠశాల ప్రారంభం

అంబాజీపేట: కంచికామకోటి పీఠం 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో శ్రీ కంచి కామకోటి నాదస్వర పాఠశాలను ముక్కామలలో సోమవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాదస్వర పాఠశాలలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు (9948770107, 9666551066) నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ముందుకొస్తున్న సముద్రం

- అంతుచిక్కని భౌగోళిక మార్పులతో అంతర్వేది తీరం
- సాగర సంగమ ప్రదేశం కావడమే కారణం
- తీరం కోత నివారణకు రూ.67 కోట్లతో ప్రతిపాదనలు


పల్లిపాలెంలో రివిట్‌మెంట్ దాటుకుని వస్తున్న గోదావరి కెరటాలు (ఫైల్)


అంతర్వేది బీచ్‌లో శాశ్వత కట్టడాల వద్ద పోటెత్తిన కడలి కెరటాలు (ఫైల్)

సఖినేటిపల్లి: అంతుచిక్కని భౌగోళిక మార్పులతో అంతర్వేది వద్ద సముద్రం తీరం వైపునకు పోటెత్తుతున్న తీరుకు తీర ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో పోటెత్తే సముద్రం, సాధారణ రోజుల్లో కూడా తీరం వైపునకు పోటెత్తుతుండడం కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని వారు చెబుతున్నారు. ఊహించని స్థాయిల్లో వస్తున్న ఈ మార్పులతో ఎటువంటి ప్రమాదం పొంచి ఉందోనన్న భయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. సాగర సంగమంకు అత్యంత సమీపంలోని పల్లిపాలెం గ్రామస్తులు దీనిపై భీతిల్లుతున్నారు.

ఇతర ప్రాంతాలకు భిన్నంగా..

రాజోలు దీవిలోని కరవాక, కేశనపల్లి, చింతలమోరి తదితర ప్రాంతాల్లోని సముద్ర తీరాలకు భిన్నంగా అంతర్వేది వద్ద తీరం మారిందని ఇక్కడి ప్రజలు అంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే అలజడిగా ఉండే సముద్రం, అంతర్వేది వద్ద మాత్రం సాధారణ రోజులలో కూడా ఉరకలు వేస్తూ తీరం వైపునకు చొచ్చుకుని వస్తోందంటున్నారు.

కారణాలు ఇవే...

- గోదావరి, సాగరం సంగమం ప్రదేశం కావడం వల్ల సాధారణ రోజుల్లోనూ రాజోలు దీవిలో ఉప్పునీరు పోటెత్తుతోంది.
- సముద్రం నీరు గోదావరి వైపునకు పోటెత్తడం, ఎగువ ప్రాంతాల నుంచి అంతర్వేదికి చేరే గోదావరి నీటి ప్రవాహం తోడవ్వడంతో ఇక్కడ నీటి మట్టం రెట్టింపు అవుతోంది.
- సముద్ర గర్భంలో వచ్చే మార్పులకు నీరు బిగపెట్టడంతో (సంగమం వద్ద గోదావరి నీరు సముద్రంలోకి రానీయకుండా) గోదావరి ప్రవాహం దిశ మళ్లి సమీప సరుగుడు తోటలను ముంచెత్తుతోంది.
- విపత్తుల సమయాల్లో, భౌగోళికంగా వచ్చే మార్పుల వల్ల సంగమంకు పడమర వైపు బియ్యపుతిప్ప వద్ద ఇసుక దిబ్బలు ఏర్పడుతున్నాయి. దీంతో కెరటాల ఉధృతి ప్రభావం సంగమంకు తూర్పు వైపు అంతర్వేది, పల్లిపాలెం తీరంపై పడుతోంది.
- అంతర్వేది లైట్‌హౌస్ వద్ద తీరం మలుపు తిరిగి ఉండడంతో తూర్పువైపునున్న అంతర్వేది వద్ద నీటి ప్రవాహ వేగం తీవ్రంగా ఉండి ఉప్పునీరు చొచ్చుకు వస్తోంది.
- 2001, 2008లో పల్లిపాలెం గ్రామ రక్షణకు గోదావరిలో నిర్మించిన గ్రోయన్లు, వాటి మధ్య రివిట్‌మెంట్ కోత కారణంగా దెబ్బతిన్నాయి. దీంతో పోటు నీరు అడ్డుఅదుపూ లేకుండా పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతోంది.
- గతానికి ఇప్పటికీ సముద్రం సుమారు 500 మీటర్లు ముందుకు చొచ్చుకు రావడంతో తరచూ పోటు సమయంలో సమీప ప్రాంతాల్లో సముద్రం ఉగ్రరూపం ప్రదర్శిస్తోంది.
- కోత కారణంగా కొద్ది సంవత్సరాలుగా సుమారు 500 ఎకరాల్లో సరుగుడు తోటలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ గ్రాంటుకు వినతి



పల్లిపాలెం రక్షణకు, అంతర్వేదిలో సాగర తీరం కోత నివారణకు రివిట్‌మెంట్, సిమెంటు గోడ నిర్మాణానికి రూ.67 కోట్ల అంచనాతో ఇటీవల ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశాం. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ గ్రాంటు మంజూరు చేయాలని కోరాం.
– రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

ఏలేశ్వరంలో యువకుడి దారుణ హత్య

కారుతో తొక్కించి చంపిన స్నేహితుడు


మణికంఠ (ఫైల్)

ఏలేశ్వరం: స్నేహితుడే కాలయముడయ్యాడు. నిత్యం కలిసి తిరుగుతూ ఉన్న స్నేహితుడే కారుతో తొక్కించి కర్కశంగా తుది ముట్టించిన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. ఈ ఘటనలో పట్టణానికి చెందిన కోరాడ మణికంఠ(23) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన కోరాడ మణికంఠ, బంటు దుర్గాప్రసాద్ స్నేహితులు. అర్ధరాత్రి 11, 12 గంటల మధ్య దుర్గాప్రసాద్ కారులో మణికంఠను బయటికి తీసుకువెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి తెల్లవారుజామున నాలుగు గంటలకు మణికంఠ తండ్రి శ్రీనివాసరావు బంధువులతో కలిసి వెతికాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగా కారులో బయటకు వస్తున్న దుర్గాప్రసాద్‌ను నిలదీశారు. దీంతో మణికంఠ తన తాతను తిట్టాడని దీనిపై నిలదీయగా నువ్వు ఊరిలో లేనప్పుడు నీ పెళ్లాం, పిల్లల పీకలు కోస్తానని చెప్పడంతో కారుతో తొక్కించి చంపేశానని దుర్గాప్రసాద్ చెప్పాడు. దీంతో మృతుడు తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా సీఐ కిషోర్‌బాబు, ఎస్సై సతీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

నేడు నిధి ఆప్‌కే నికత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని జిల్లాల్లో సోమవారం నిధిఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సహాయ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కడియం ఎంఆర్‌పాలెంలోని ఆంధ్రపేపరుమిల్లు లిమిటెడ్ వద్ద, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురంలోని ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద, కాకినాడ జిల్లాలో ఎస్ఎఫ్‌సీఎల్ వద్ద నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా జిల్లాల పరిధిలోని పీఎఫ్ ఖాతాదారులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్‌లు హాజరై తమ ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

రూటు మారుస్తున్న కేటుగాళ్లు

- ముందుగా డబ్బులు పంపి.. ఆ తరువాత వేధింపులు
- సరి కొత్త పంథాలో బెదిరింపులు

కడియం: లోన్ యాప్ వలలో చిక్కుకున్న వారిని నానా రకాలుగా వేధిస్తున్న కేటుగాళ్లు ఇప్పుడు రూటు మారుస్తున్నారు. అడక్కుండానే ముందుగా కొంత డబ్బులు పంపి ఆ తరువాత వేధింపులు మొదలు పెడుతున్నారు. కడియం మండలానికి చెందిన దేవి దిశ యాప్‌ను ఆశ్రయించడంతో ఈ కొత్త తరహా మోసం వెలుగుచూసింది. దిశ స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవికి ఒక గుర్తు తెలియని నంబరు నుంచి రూ.2 వేలు డబ్బులు వచ్చాయి. అయితే పొరపాటున వచ్చి ఉంటాయని భావించి, ఆ డబ్బులను తిరిగి వెనక్కి పంపించి వేసింది. కొన్ని రోజులుగా అదే నంబరు నుంచి హిందీ, ఇంగ్లిషులో ఒక వ్యక్తి మాట్లాడుతూ వేధింపులు మొదలు పెట్టాడు. ఇంకా డబ్బులు పంపించాలని, లేకపోతే న్యూడ్ ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించడం ప్రారంభించాడు. ఆ వ్యక్తి మార్ఫింగ్ చేసిన న్యూడ్ ఫోటోలను పంపించడం మొదలు పెట్టాడు. ఈ బెదిరింపులు శృతి మించడంతో దిశ పోలీస్‌లకు ఫోన్ చేసి తన బాధను చెప్పుకుంది. దేవి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సదరు ఆగంతకుడు ఫోన్ చేసిన నంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. అజ్ఞాత వ్యక్తులు బెదిరింపులకు దిగితే దిశకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. గతంలో అప్పు తీసుకున్న వారిని మాత్రమే వేధించేవారని, కానీ ఇప్పుడు ఇలాంటి మోసాలకు కూడా తెగబడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్న ట్యాంకర్, టిప్పర్
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


లారీ క్యాబిన్ నుంచి ఎగసి పడుతున్న మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు బలంగా ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా పెను ప్రమాదం త్రుటిలో తప్పిన ఘటన ఆదివారం అర్ధరాత్రి పెద్దాపురం ఏడీబీ రోడ్డులో చోటు చేసుకుంది. పెద్దాపురం పోలీసుల కథనం ప్రకారం మహారాష్ట్ర నుంచి కాకినాడకు వెళుతున్న ట్యాంకర్‌ను స్థానిక పాండవుల మెట్ట వద్ద జంక్షన్‌లో పెద్దాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న టిప్పర్ బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆయిల్ ట్యాంక్ పగిలి మంటలు వ్యాపించాయి. రెండు అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశాయి. ఈ ప్రమాదంలో ఎదురుగా ఉన్న ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా ఘటన జరిగిన ట్యాంకర్‌లో 30 వేల లీటర్ల ఇథనాల్ ఉంది. ట్యాంకర్‌కు నిప్పంటుకోకుండా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రావులపాలెం - అమలాపురం రహదారిలో పరచుకున్న పచ్చదనం


సరికొత్త అందాలతో తురాయి చెట్టు

ఎర్రటి ఎండలో పచ్చటి పందిరి!

కోనసీమ పచ్చదనానికి, పచ్చని పంటలకు పెట్టింది పేరు. ప్రస్తుతం మండు వేసవికాలంలో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరి వడగాడ్పులు వీస్తున్నాయి. అయినా ఈ ప్రాంతంలో పచ్చదనం ఎక్కడా చెక్కు చెదరలేదు. మండుటెండలో ప్రయాణించే వాహనదారులను రహదారులకు ఇరువైపులా కొత్త అందాలతో కొలువుదీరిన వృక్షాలు స్వాగతిస్తున్నాయి. మధ్యలో ఎర్రటి పుష్పాలతో తురాయి చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈ వృక్షాల వయ్యారాలను కోనసీమ ముఖద్వారం రావులపాలెం నుంచి అమలాపురం వెళ్లే రహదారి పొడవునా చూడవచ్చు. కోనసీమకు వచ్చే వివిధ ప్రాంతాల వారిని ఇవి విశేషంగా ఆకర్షిస్తున్నాయి.
– కొత్తపేట

రైల్వే విద్యుత్తు లైనుపై పడిన చెట్లు

- విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్లకు అంతరాయం
- హుటాహుటిన తొలగించిన రైల్వే సిబ్బంది


సామర్లకోటలో తెగి పోయిన విద్యుత్తు వైర్లను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

సామర్లకోట: తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట గాంధీచౌక్ వద్ద రైల్వే విద్యుత్తు వైర్లపై చెట్లు విరిగి పడటంతో విశాఖపట్నం వైపు వెళ్లే రెండు రైళ్లు అరగంట నిలిచిపోయాయి. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం వచ్చింది. ఆ సమయంలో పిల్లకాలువ ఆవలివైపు ఉన్న బూరుగుచెట్లు విరిగి రైల్వే విద్యుత్తు లైన్లపై పడ్డాయి. దాంతో విద్యుత్తు వైర్ల వద్ద మంటలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. రైల్వే విద్యుత్తు ప్రధాన లైను వైర్లు తెగిపోయాయి. దాంతో విశాఖపట్నం వైపు వెళ్లే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను సామర్లకోట స్టేషన్‌లోనూ, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను మేడపాడు స్టేషన్‌లోనూ అరగంట పాటు నిలిపి వేశారు. రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ఏడీఈఎన్ శివప్రసాద్, ఎలక్ట్రికల్ సీనియర్ సెక్షన్ ఇంజినీరు లోవరాజు, పీడబ్ల్యూ దాసరి రవిశంకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఆర్పీఎఫ్ ఎస్సై ఎస్.రామకృష్ణ ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. తమ సిబ్బందితో చెట్లను తొలగించి, తెగిపోయిన వైర్లకు మరమ్మతులు చేసి రైళ్లను పునరుద్ధరించారు.

వేసవి వేడి.. కొండెక్కిన కోడి

- బ్రాయిలర్ హోల్‌సేల్ ధర రూ.162
- చికెన్ రూ.300 పైమాటే
- వేసవి ప్రభావంతో తగ్గిన కోళ్ల సరఫరా


పెదపళ్లలోని బ్రాయిలర్ కోళ్ల ఫారం

ఆలమూరు: బ్రాయిలర్ కోడి ధర కొండెక్కి కూర్చుంది. రికార్డు స్థాయిలో రెండేళ్ల గరిష్ట స్థాయికి చేరుకుంది. దీంతో మాంసాహార ప్రియులు ధరలు చూసి బెంబేలెత్తి పోతున్నారు. ముక్క లేనిదే ముద్ద దిగని మాంసాహారులకు పెరిగిన ధర మింగుడుపడటం లేదు. సాధారణంగా ప్రతి రోజూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 400 టన్నుల బ్రాయిలర్, లేయర్ కోళ్ల సరఫరా జరగుతుంది. కోళ్ల ఉత్పత్తి మందగించడంతో ఏర్పడిన కొరత దృష్ట్యా వారం రోజుల నుంచి తుని, రాజమహేంద్రవరం తణుకులోనున్న కోళ్ల ఉత్పత్తి కంపెనీలు, రైతుల నుంచి కేవలం 250 టన్నుల వరకూ మాత్రమే సరఫరా జరగుతోంది. వేసవి ప్రభావం దృష్ట్యా కోళ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో పాటు ఎండ తీవ్రతను తట్టుకోలేక అనునిత్యం వేలాది కోళ్లు మృత్యువాత పడటం ఈ ధరలు పెరుగుదలకు కారణమని తెలుస్తోంది. మూడు నెలల నుంచి చికెన్ ధరలు రూ.100 లోపే ఉండటంతో నష్టాలు తట్టుకోలేని రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించారు. దీంతోపాటు వేసవి ప్రభావాన్ని ముందే ఊహించిన కొంతమంది కోళ్ల పెంపకాన్ని తగ్గించడంతో ఉత్పత్తి మందగించింది. కంపెనీల నుంచి స్థానిక హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా దారులు రూ.150 ధర నిర్ణయించగా, రిటైల్లకు రూ.165 వరకూ విక్రయిస్తున్నారు.

చికెన్ ధర పెరిగినా తగ్గని విక్రయాలు

బహిరంగ మార్కెట్లో బ్రాయిలర్ కోడి కేజీ హోల్‌సేల్ ధర రూ.170 కాగా చికెన్ కేజీ రూ.300, బోన్‌లెస్ రూ. 400 వరకూ విక్రయిస్తున్నారు. కోళ్ల కొత్త బ్యాచ్‌లు వచ్చే వరకూ మరో నెల రోజుల వరకూ ఇంచుమించు ఇదే ఇవే ధరలు ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం చికెన్ ధర ఆశాజనకంగా ఉండటంతో స్థానిక రైతులు వారం రోజుల నుంచి కోళ్ల ఫారంలో ఉన్న కోళ్లలో కేజీన్నర దాటిన వాటిని విక్రయించే పనిలో పడ్డారు. ఇప్పుడు ఆ బ్రాయిలర్ కోళ్ల సరఫరా అంతంగా మాత్రంగానే ఉండటంతో చికెన్ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. చికెన్ ధరలు పెరుగుతున్నా విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. స్థానికంగా ఎండల నుంచి ఉపశమనాన్ని పొందే విధంగా చర్యలు తీసుకుని కోళ్ల పెంపకం సాగిస్తున్న చిన్నకారు రైతులకు మాత్రం ఈ ధర అమాంతం లాభాలు తెచ్చి పెడుతోంది.

ఉష్ణోగ్రతల ప్రభావంతోనే చికెన్ ధర పెరిగింది



వేసవి దృష్ట్యా రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల చికెన్ ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో వేడిమిని తట్టుకోలేక కోళ్ల ఫారాల్లో రోజూ సరాసరి వందలాది కోళ్లు మృతి చెందుతున్నాయి. పెరిగిన ధరలలోను రైతులు నష్టాలను చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ ధరలు జూన్ నెలాఖరు వరకూ కొనసాగే అవకాశం ఉంది.
– బొబ్బా వెంకన్న, హోల్‌సేల్ కోళ్ల వ్యాపారి, పెదపళ్ల

పిడుగు పడి పాడి గేదెల మృతి


మృతిచెందిన గేదెలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి రెండు పాడి గేదెలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తన పాడి గేదెలను పొలంలో మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములతో కూడిన మెరుపులు వచ్చి పిడుగుపడడంతో పొలంలో మేస్తున్న రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందినట్టు చిన జగ్గంపేటకు చెందిన రైతు వమ్మి దొంగబ్బాయి తెలిపారు. వర్షం వస్తుందని తాను చెట్టు నీడకు వెళ్లిపోవడంతో పిడుగు నుంచి తాను తప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. గేదెల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ఉత్కంఠగా రగ్బీ పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పిఠాపురం: పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి స్త్రీ, పురుష క్రీడాకారులు హాజరయ్యారు. తొలి రోజు తలపడిన జట్ల మధ్య పోటీ ఉత్కంఠ భరితంగా జరిగింది. రెండో రోజు ఆదివారం పోటీలలో పురుషుల విభాగంలో తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాలు...మహిళల విభాగంలో విజయనగరం, నెల్లూరు జిల్లాల జట్లు ఫైనల్‌కు చేరుకున్నట్లు నిర్వాహకుడు లక్ష్మణరావు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.